క్లుప్తంగా

టీబీ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కల్లూరురూరల్: మండలంలోని హనుమతండా గ్రామ పంచాయతీలో గురువారం డాక్టర్ నవ్య కాంత్ ఆధ్వర్యంలో టీబీవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వృద్ధులు, డయాబెటిక్, బీపీ తదితర వారి నుంచి కళ్లె నమూనాలను సేకరించారు. అనంతరం గ్రామ ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ జి.రామారావు, టీబీ చికిత్స సూపర్‌వైజర్ సంజీవ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హరీష్, ఏఎన్ఎం నిర్మల, పద్మ, ఆశా కార్యకర్త జ్యోతి, లక్ష్మి, జమలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏబీవీపీ దాడిని ఖండించండి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగరాజు

వైరా: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులపై ఏబీవీపీ చేసిన దాడిని విద్యావంతులు, మేధావులు ఖండించాలని ఎస్ఎఫ్ఐ వైరా సబ్‌డివిజన్ అధ్యక్ష , కార్యదర్శులు పుప్పాల నాగరాజు, కోట ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం వైరా బోడేపూడి భవన్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అండ చూసుకుని వామపక్ష విద్యార్థులే లక్ష్యంగా మతతత్వ అరాచక శక్తులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూజీసీ భవన్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో జశ్వంత్, అజయ్, హేమంత్, గణేష్, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

వైరారూరల్: అగ్నిప్రమాదానికి గురై పంట నష్టపోయిన రైతులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లెనపాడు గ్రామానికి చెందిన లెగిశెట్టి ఆదినారాయణ, శ్రీరామినేని తిరుపతిరావు, చెరుకూరి రాజేంద్రప్రసాద్‌లకు చెందిన మామిడి, సుబాబులు తోటలు అగ్నిప్రమాదానికి గురై కాలిపోయియాయి. వీటిని గురువారం రైతు సంఘం బాధ్యులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సంఘం బాధ్యులు కిలారు శ్రీనివాసరావు, అమరనేని వెంకటేశ్వరరావు, వెంపటి రాజేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



చెన్నారావు

కొణిజర్ల: టీపీసీసీ ఎస్సీ విభాగం ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా కొణిజర్ల మండలం గోపవరం గ్రామానికి చెందిన దర్శి చెన్నారావు నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ 17 పార్లమెంట్ స్థానాలకు గాను 17 మంది ఎస్సీ విభాగం ఆఫీస్ బేరర్లను పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ.. వచ్చేనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు.

పాస్టర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత

మధిర: తెలంగాణ మధిర మండల పాస్టర్ల అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఫిలదెలిఫియా హోలీ చర్చిలో గురువారం పాస్టర్ల సమావేశం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా జాన్ పీటర్, కార్యదర్శిగా జాషువా, ఉపాధ్యక్షుడిగా గద్దల యేసు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత పాల్గొని మాట్లాడారు. పాస్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో గురువారం ఆలయాల అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయినాథునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు బాబాని దర్శించుకుని పూజలు చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో సాయినిలయంలో బనిగండ్లపాడు గ్రామానికి చెందిన బండారు వెంకట్రావు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధుల్లేక నీరసం !



తిరుమలాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం

పంచాయతీల్లో పైసల్లేవ్

- నిలిచిపోయిన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు
- కష్టంగా రోజువారి పనుల నిర్వహణ
- నెలలుగా కార్మికులకు అందని వేతనాలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

చింతకాని: నిధుల కొరతతో గ్రామ పంచాయతీల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత జీపీల్లో సమస్యల పరిష్కారానికి దిక్కే లేకుండాపోయింది. గ్రామాల్లో ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిశాక ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ వారు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పలు జీపీల్లో మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలను ఇవ్వకపోవటంతో పనులు ఎలా చేయాలంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలవర్గాల పదవీకాలం ముగిశాక పాలన అస్తవ్యస్తంగా తయారైంది.

నిధుల కొరత..

చింతకాని మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటిలో కొన్ని జీపీలకు మినహా అన్నిచోట్లా నిధుల కొరత సమస్య వేధిస్తోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవటంతో ఫిబ్రవరి రెండో తేదీ నుంచి గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. పరిపాలన, పర్యవేక్షణ బాధ్యతలతో పాటు పంచాయతీ కార్యదర్శితో కలిసి ప్రత్యేకాధికారులకు చెక్‌పవర్ ఇచ్చారు.

కష్టంగా మారిన జీపీల పాలన..

కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలనుంచి విడుదలయ్యే నిధులు గత పదిహేను నెలలుగా ఆగిపోయాయి. దీంతో పంచాయతీల పాలన సాగించడం కార్యదర్శులకు ఇబ్బందిగా మారింది. దీంతో జనరల్ ఫండ్‌తో పాటు మిగిలిన చాలీచాలని నిధులతో పాలనను వెళ్లదీస్తున్నారు. పలు జీపీలలో ట్రాక్టర్ల వాయిదాలను చెల్లించకపోవటంతో పాటు వాటికి మరమ్మతులు కూడా చేయించలేని దుస్థితిలో ఉన్నట్లు సమాచారం. ప్రత్యేకాధికారులకు మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలను అప్పగించడంతో వారు ఏ గ్రామానికి కూడా పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించలేక పోతున్నారు. దీనితో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి.

మల్టీపర్పస్ వర్కర్ల ఇక్కట్లు..

మండలంలో ఉన్నటువంటి 26 గ్రామ పంచాయతీల్లో మొత్తం 109 మంది మల్టీవర్కర్లు పనిచేస్తున్నారు. వీరికి సుమారు ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చేదే అరకొర అవికూడా సక్రమంగా ఇవ్వకపోతే జీవనం ఎలా సాగించాలని వారు ప్రశ్నిస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో కార్యదర్శులు..

నిధులు లేక గ్రామ పంచాయతీల్లో పనులు చేయలేని పరిస్థితి ఉండటంతో కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. పంచాయతీల్లో తాగునీటి పథకాలకు సంబంధించి మరమ్మతులు, ఇతర పనులకు అప్పులు తెచ్చి ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నారు. గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులు కేవలం పర్యవేక్షణకే పరిమితం అవుతుండగా.. నిధుల కొరత గురించి అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదని కార్యదర్శులు చెబుతున్నారు.

వేతనాలు చెల్లిస్తాం..



గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు పెండింగ్ ఉన్నది వాస్తవం. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేసిన వెంటనే కార్మికులకు వేతనాలను చెల్లిస్తాం. ప్రతినెలా వేతనాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– ఆర్.రామయ్య, ఎంపీడీఓ, చింతకాని

ఇబ్బంది పడుతున్నాం..



ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవటంతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉంటుంది. అర్ధాకలితో విధులకు హాజరు కావాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతినెలా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– దేశబోయిన కొండలు, మల్టీపర్పస్ వర్కర్, నాగులవంచ

ఆందోళన చేస్తాం..



గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలను చెల్లించకుంటే ఆందోళన చేపడతాం. ప్రభుత్వం పంచాయతీలకు నిధులను విడుదల చేస్తే కార్మికుల వేతనాలకు ఇబ్బంది ఉండదు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే విధులు ఎలా నిర్వర్తించాలి, కుటుంబం ఎలా గడవాలి.

– తాళ్లూరి వెంకటేశ్వర్లు, జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు

ఆదాయమే లక్ష్యంగా పనిచేయాలి



జెండా ఎగురవేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: ప్రతిరోజు అదనంగా రూ.లక్ష ఆదాయం తెచ్చే విధంగా డిపోలోని ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి కోరారు. గురువారం సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపోలో అదనపు ఆదాయం రూ.లక్ష లక్ష్యం అనే కార్యక్రమాన్ని జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం నవంబర్ వరకు సత్తుపల్లి డిపో కోటి 82 లక్షల రూపాయలు లాభాల్లో ఉందన్నారు. ప్రయాణికులకు బస్సు ఎక్కడ ఉన్నదో తెలుసుకునే సౌకర్యం కలగడం వల్ల డిపో వారీగా ఆదాయం పెరిగినట్లు తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలో ఉన్న ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నాన్ ఏసీ, స్లీపర్ లహరి బస్సులను ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితీ, ఆఫీస్ సూపరింటెండెంట్ రాములు, టిఐ పి.సుబ్బారావు, ఏడీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



అంగన్‌వాడీ టీచర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న సీడీపీఓ దయామణి

కారేపల్లి: రోజు రోజుకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో.. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు అంగన్‌వాడీ టీచర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దయామణి తెలిపారు. గురువారం కారేపల్లిలోని చిన్నబడి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ దయామణి చేతుల మీదుగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి మాట్లాడారు. కారేపల్లి మండలంలో 5 అంగన్‌వాడీ సెక్టార్లలో 132 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు, అంగన్‌వాడీ ఆయాలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని టీచర్లు, ఆయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, రోహిణి, సుభద్ర, రాధ, పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, బేబి, రాజమణి, రఘుపతి, ఆయాలు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

బీజేపీదే అధికారం



వేంసూరు: ఇంటింటి ప్రచారం చేస్తున్న నంబూరి రామలింగేశ్వరరావు

వేంసూరు/సత్తుపల్లి రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పర్స రాంబాబు అధ్యక్షతన.. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదే విధంగా సత్తుపల్లిలోని బేతుపల్లి, కొత్తూరు పోలింగ్ బూత్‌లలో సత్తుపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటి వివరిస్తూ ఓట్లు అడుగుతున్నామన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మట్టా ప్రసాద్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె రహ్మతుల్లా, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు భీమిరెడ్డి బాలకృష్ణ, రాఘునాథరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఉబ్బల కృష్ణ, తిరుపతిరావులతో పాటు నాయకులు మరికంటి గణేష్, పాలకొల్లు రోజారాణి, శిరీష, అనూష పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి పట్టాభిషేకం



సీతారామచంద్రస్వామికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ: మండలపరిధిలోని ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణం అనంతరం రాములోరి పట్టాభిషేకం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వారి శిష్యబృందంచే వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని పట్టాభిషేకాన్ని తిలకించారు.

బెల్టుషాపుల్లో తనిఖీలు

కారేపల్లి: మండలంలోని పలు ప్రాంతాల్లో బెల్ట్ షాపులపై కారేపల్లి పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీనగర్‌లో కల్తి సరోజకు చెందిన బెల్ట్‌షాపు నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారాం తెలిపారు.

వైద్యశిబిరాలు విజయవంతం



ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యాధికారి స్రవంతి

బోనకల్: మండలంలోని నారాయణపురం, చొప్పకట్లపాలెం, ముష్టికుంట్ల, కోనారెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. వైద్యాధికారి స్రవంతి, తహసీల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వలన వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏలూరు నాగేశ్వరరావు

మధిర: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, అసెంబ్లీ ప్రభారీ విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. గురువారం మధిర పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ వేస్తారని, ఈ కార్యక్రమానికి అన్ని పోలింగ్ బూత్‌ల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, నాయకులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి, అప్పారావు, వరప్రసాద్, నూతక్కి నరసింహారావు, మద్దినేని వెంకటేశ్వర్లు, రవి, సికిందర్, కాసిన నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మే 6 వరకు పరీక్ష ఫీజు గడువు

కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిష్టర్ పరీక్ష ఫీజు గడువు మే 6 వరకు చెల్లించాలని మధిర స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు మే 26 నుంచి జూన్ 1 వరకు జరుగుతాయని.. అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల సప్లమెంటరీ పరీక్ష ఫీజు ఏప్రిల్ 26వ తేదీ వరకు చెల్లించాలన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు మే 17 నుంచి 20 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మే 24 నుంచి 29 వరకు, తృతీయ సంవత్సర పరీక్షలు మే 17 నుంచి 22 వరకు జరుగుతాయన్నారు. పరీక్ష ఫీజును టీఎస్ ఆన్‌లైన్‌లో గానీ, మీసేవలో గానీ, చెల్లించాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు మధిర, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెల్ నంబర్ 7382929694ను సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కొత్తనారాయణపురం గ్రామస్తులు

కల్లూరురూరల్: మండలంలోని కొత్త నారాయణపురం(గోకవరం)లో అనేక సంవత్సరాలుగా కుంటుపడిన సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గ్రామానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కోటపాటి వీరభద్రరావు, మాజీ సర్పంచ్ శివాజీ, గ్రామ ప్రముఖులు పొంగులేటి ఉదయసేనారెడ్డి, మార్త కోటేశ్వరరావు, వడ్డేపల్లి తిరుపతిరావు, పానుగంటి మహేశ్వరరావులు మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత గ్రామమైన అభివృద్ధి కుంటుపడిందన్నారు. నారాయణపురంలో సైడ్‌డ్రెయిన్ లేక మురుగునీరు గృహాల్లోకి వస్తున్నాయని, కల్లూరు నుంచి కొత్త నారాయణపురం మీదుగా కొర్లగూడెం క్రాస్‌రోడ్ వరకు డివైడర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. అదే విధంగా విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, గ్రామస్తులు సాగర్‌కెనాల్ వరకు సొంతంగా నిర్మించుకున్న మట్టిరోడ్డుకు మెటల్ వేయాలని కోటపాటి వీరభద్రరావు, శివాజీ, పొంగులేటి ఇంద్రసేనారెడ్డి కోరారు. ఈ సమావేశంలో కోటపాటి మల్లికార్జున్ రావు, బ్రహ్మల్లతర్నసింగ్, చెన్ను వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



వృద్ధురాలికి నిత్యావసరాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలో ఉంటున్న అనాథ వృద్ధురాలు రోజనమ్మకు యువసేనా సమితి ఆధ్వర్యంలో గురువారం గాయత్రి పెయింట్స్ నిర్వాహకుడు శివ నిత్యావసరాలు అందించాడు. ఈ సదర్భంగా 25 కేజీల బియ్యం, కూరగాయలు, పరుపు, పాదరక్షలు, చీరలు, నిత్యావసరాలను మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న యువసేన సమితి సభ్యులకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యువ సేవాసమితి వ్యవస్థాపకులు జొన్నలగడ్డ రాజు, కిష్టారం యువసేవాసమితి అధ్యక్షుడు తీగవరపు కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉబ్బన దుర్గాప్రసాద్, సభ్యులు పూర్వకంటి శ్యామ్, మల్లెల వెంకీ, పుట్ట అఖిల్, తీగవరపు చరణ్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మధిర(చింతకాని): చింతకాని జెడ్పీ ఉన్నత ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థిని కల్పనకు.. పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు పద్మావతి అందించిన రూ.10 వేలు అందించారు. గురువారం ఆ నగదును ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ అందజేశారు. విద్యార్థి ఇబ్బందులను తెలుసుకున్న టీచర్ తన పుట్టినరోజు సందర్భంగా నగదు అందించారు. దీంతో ఆమెను యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ సైదులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఒలంపియాడ్' సర్టిఫికెట్లు



విద్యార్థులకు ఒలంపియాడ్ అకాడమీ సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: హైదరాబాద్‌కు చెందిన ఎయిమ్స్ ఒలంపియాడ్ ఐఐటీ అకాడమి ఆధ్వర్యంలో సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం ఐఐటీ తరగతులు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన పరీక్షలు, పేపర్ వాల్యుయేషన్ కూడా దశలు వారీగా ఒలంపియాడ్ అకాడమీ వారే నిర్వహించారు. ఆయా తరగతులకు సంబంధించిన ఐఐటీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు అకాడమీ గురువారం ప్రశంసా పత్రాలు అందజేసింది. ప్రస్తుతం దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఖరగ్‌పూర్ ఐఐటీలో విద్యనభ్యసిస్తున్న భార్గవి, బాసర ట్రిపుల్ ఐటీ చదువుతున్న సాదియా లను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, బుగ్గపాడు శ్రీకనకదుర్గ ఆలయ నిర్వాహకులు యార్లగడ్డ దయానంద్(నందు), ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎత్తిపోయట్లే..

- పనిచేయని ఎత్తిపోతల పథకాలు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గంధసిరిలోని మున్నేరు సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం షెడ్డు

మండలంలోని మున్నేరు పరివాహక ప్రాంతంలోని సన్న చిన్న కారు రైతులకు సాగు నీరందించేందుకు రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం రైతులపాలిట శాపంగా మారడంతో పంటపొలాలు బీళ్లుగా మారుతున్నాయి. దీంతో రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. నాసిరకం పరికరాలను వినియోగించడం వల్ల ఏ ఒక్కటి సరిగా పనిచేయడం లేదు. మండలంలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు విడుదలైన నిధులు, వాటి నిర్వహణ సక్రమంగా లేదని ఆరోపణలొచ్చాయి.

ముదిగొండ: మండలంలోని పదిహేను ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి కింద 1,090 ఎకరాలు సాగవ్వాల్సి ఉండగా కేవలం 280 ఎకరాలకు మాత్రమే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరందుతుంది. ఎత్తిపోతల పథకాల ఆధునికీకరణ లేకపోవడంతో మండలంలోని వల్లాపురం, ముత్తారం, న్యూలక్ష్మీపురం, పండ్రేగుపల్లి, గోకినేపల్లి, గందసిరి, గ్రామాల్లోని 10 ఎత్తిపోతల పథకాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

మండలంలోని ఇలా..

మండలంలోని పండ్రేగుపల్లి ఎత్తిపోతల పథకం 45 ఎకరాలకు నీరందించాల్సి ఉండగా పంపు షెడ్ నిర్మాణం, ఆర్‌సీసీ పైపులైన్ నిర్మాణం, పంపుసెట్లు ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా కావడం లేదు. న్యూలక్ష్మీపురంలోని వాగుపై ఉన్న ఎత్తిపోతల కింద 149 ఎకరాలు, ముత్తారంలోని ఎత్తిపోతల కింద 40 ఎకరాలు నీరందించాల్సి ఉండగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇవి నిరుపయోగంగా మారాయి. అలాగే గందసిరిలో 1996లో ఎస్సీ రైతులకు ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టిన ఎత్తిపోతల పథకం కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే పనిచేసింది. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా అరవై ఎకరాలకు సాగునీరందడం లేదు.

– పెద్దమండవ ఎత్తిపోతల పథకానికి రూ.1.56 లక్షలు వెచ్చించి మర్మతులు చేపట్టగా.. ఇదొక్కటి మాత్రమే పనిచేస్తుంది. వల్లాపురం పథకం మరమ్మతులకు రూ. 1.65 లక్షలు, రెండో దానికి రూ. 5.76 లక్షలు వెచ్చించి మరమ్మతులు, పంపు షెడ్డు నిర్మాణం చేపట్టాగా అవి సరిగా పనిచేయకపోవడంతో 194 ఎకరాల భూములకు నీటి సరఫరా కావడంలేదు. వల్లాపురంలోని రెండు ఎత్తి పోతల పథకాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని రైతులు, సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులకు అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న మోటార్, పైపులైన్లు

పనిచేయక పదేళ్లు..



పథకం పదేళ్ల నుంచి పనిచేయకపోవడంతో అధికారులకు, ప్రజాప్రనిధుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదు. ప్రతీ సంవత్సరం రైతులు మోటార్లు కొనుక్కొని పొలాలకు నీళ్లు పెట్టుకుంటూ పంట పండించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు పట్టించుకోని కొత్తగా నిర్మాణాలు చేపట్టాలి.

– పాము శిల్వరాజు, పండ్రేగుపల్లి

మరమ్మతులు చేయించాలి..



ఇలాంటి గడ్డుకాలంలో పథకాలు పని చేస్తే సన్న, చిన్న కారు రైతులకు చాలా మేలు జరిగేది. అధికారులు ఇప్పటికైనా ఉన్న ఎత్తిపోతల పథకాలకు వెంటనే మరమ్మతులు చేయించాలి. వారికి రుణాలు మంజూరు చేసి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– రౌతు నాగయ్య, గంధసిరి